క్లుప్తంగా

దుర్గ నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట పూజ


ముహూర్తపు రాట వేస్తున్న పూజారి ప్రసాదశర్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం నర్సిపురంలో దుర్గ నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట పూజ బుధవారం పూజారి ప్రసాదశర్మ కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 24 వరకు దుర్గాదేవికి నవరాత్రి ఉత్సవాలు స్థానిక పెద్దవీధిలో జరుపుతామని, ఈ ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పంట పొలాలను ఈకేవైసీ చేయించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. పాపమ్మవలస, నిడగల్లు గ్రామాల్లో ఈకేవైసీ చేసేందుకు రైతులకు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన పాపమ్మవలసలో మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయడం పూర్తి కావచ్చినప్పటికీ ఈకేవైసీ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకేవైసీ చేసిన పంటలకు పంట రుణాలు పొందవచ్చని, ప్రభుత్వం ఇస్తున్న వ్యసాయ సంక్షేమ పథకాలు పొందడానికి, రాయితీ అందిపుచ్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది ఇసుక రేవులపై ఎస్ఐ కె.నీలకంఠంతో పాటు సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సువర్ణముఖీ నదిలోని సీతానగరం శివాలయం రేవులో అనుమతి లేకుండా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అనుమతి లేకుండా ట్రాక్టర్లతో ఇసుక తరలించడం నేరమని తెలిసినా యథేచ్ఛగా ఇసుక తరలించడం నేరమన్నారు. ప్రభుత్వ అనుమతితో ఇసుక తరలించడానికి అనుమతులున్నాయని అన్నారు.

విజయమౌళికి ఆర్థిక సాయం


విజయమౌళికి ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

సాలూరు: అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి ఇతర దేశాలతో పోటీ పడుతున్న పట్టణానికి చెందిన బర్లి విజయమౌళికి మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ వంతు ఆర్థిక సాయం చేశారు. మౌళికి రూ.10వేలు బుధవారం అందజేశారు. మౌళి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, సభ్యులు జగదీష్, సాయి, నాగార్జున, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి


విద్యార్థుల వివరాలపై ఆరా తీస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి బి. ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరుపట్టీని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

రేగిడి: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. మండలంలోని లచ్చారాయపురంలో మహిళలు, కిశోర బాలికలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం...

- సమన్వయంతో సమష్టిగా పని చేద్దాం..
- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: సమన్వయంతో సమష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయం వరించేలా చేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని వెలంపేట కల్యాణ మండపం వద్ద ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వివరించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా వైద్యానికి అధిక ప్రాధాన్యం ముఖ్యమంత్రి ఇస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప ఆలోచన అని పేర్కొన్నారు. దీనిపై ప్రజలను చైతన్యవంతం చేసి సద్వినియోగం చేసుకునేలా పని చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వద్దకు ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లి సేవలు అందించాలన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి అందరూ సహకరించాలన్నారు. ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి విధి విధానాలను వివరించారు. రాష్ట్ర ప్రజల ఆశాదీపంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని అన్నారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, రాంబాబు, గిరి రఘు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న రహదారి కష్టాలు


సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రవణమ్మ

సీతానగరం: జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ బలగ రవణమ్మ అన్నారు. మండలంలోని కృష్ణారాయపురంలో బుధవారం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ జి.అన్నంనాయుడుతో కలిసి ఆమె భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.రవణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకున్న చొరవ కారణంగా చినబోగిలి కాటిల్‌ఫాం నుండి గాదెలవలస, గుచ్చిమి జంక్షన్ నుంచి టి.సీతారాంపురం, పణుకువలస నుంచి చినంకలాం, నిడగల్లు నుంచి నరిసిపురం జంక్షన్ వరకూ బీటీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.శ్రీరాములునాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పి.బలరాంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు జి.శ్రీరాములు, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సహాయకులు ఎ.తిరుపతిరావు, సర్పంచ్‌లు బి.నందిని, బి.శ్రీనివాసరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి


బైరిపురం పాఠశాలలో విద్యార్థుల చేత చదివిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ 1 సామల సింహాచలం అన్నారు. బైరిపురం ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల చేత పాఠ్యపుస్తకాలు చదివించి విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మరింతగా విద్యా ప్రమాణాలు పెంపుదల చేయాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు బోధించే సమయంలో బోధనా పరికరాలను వినియోగిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అమలు పరచాలన్నారు. నాడు - నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

అందుబాటులోకి ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీసులు


ఆర్టీసీ లాజిస్టిక్ పాయింట్‌ను తనిఖీచేస్తున్న ఎమ్అండీసీ అప్పలనాయుడు

సాలూరు: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాజిస్టిక్ సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఎమ్అండీసీ బి.అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో ఆర్టీసీ డిపోను ఆయన బుధవారం సందర్శించారు. లాజిస్టిక్ పాయింట్లు తనిఖీ చేసి కస్టమర్లతో మాట్లాడారు. ఈ సర్వీసులు ద్వారా రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా కొరియర్స్, పార్సిల్స్ చేరుకుంటాయని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా బస్సు సర్వీసులు పారాది బ్రిడ్జి మరమ్మతులకు గురైన నేపథ్యంలో సాలూరు నుంచి పారాది, పారాది నుంచి సాలూరుకు ఆర్టీసీ బస్సులు ప్రతి పది నిమిషాలకు నడుపుతున్నామని డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, వైజాగ్‌లు వెళ్లే బస్సులు వయా బొబ్బిలి, ఆకులకట్ట, బాడంగి, రామభద్రపురం మీదుగా నడుపుతున్నామని తెలిపారు.

ప్రయాణికులు గమనించాలి

పార్వతీపురం టౌన్: పారాది వంతెన మరమ్మతుల కారణంగా పార్వతీపురం – విశాఖపట్నం మధ్య ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్లు మార్చామని ప్రయాణికులు గమనించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ బుధవారం తెలిపారు. పల్లె వెలుగు బస్సులు పారాది వంతెన వరకు వెళ్తాయన్నారు. పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ సరీస్వులను బొబ్బిలి, బాడంగి మీదుగా మళ్లించడం జరిగిందన్నారు. విశాఖపట్నం నుంచి పార్వతీపురం వచ్చే బస్సులు ఆకులకట్ట మీదుగా బొబ్బిలి, పార్వతీపురం చేరుకుంటాయన్నారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్లు, ఇళ్లల్లో గ్యాస్‌ల వినియోగం పట్ల అశ్రద్ధ తదితర కారణాలతో అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి అనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు.కార్యక్రమంలో , అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండొచ్చని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని గంగన్నపాడులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వండిన వంటలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో లోచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టల్ సేవలకు అంతరాయం

బాడంగి: అఖిలభారత గ్రామీణ తపాలశాఖ జీడీఎస్ ఉద్యోగ సంఘం పిలుపుమేరకు పోస్టల్ సిబ్బంది బుధవారం ఒక్కరోజు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో మండలంలోని పోస్టాఫీసు శాఖలన్నీ మూతపడ్డాయి. పోస్టల్ సిబ్బంది అంతా సాలూరు డివిజన్ పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన సమ్మెలో పాల్గొనేందుకు వెళ్లడంతో పోస్టల్ సేవల కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఆస్పత్రిలో పింఛన్ల అందజేత


విజయనగరం సాయి ఆస్పత్రిలో ఆచారికి పింఛను అందజేస్తున్న వలంటీరు ఎస్.సునీత


విశాఖ ఆస్పత్రిలో సాయమ్మకు పింఛను అందజేస్తున్న ఎం.రాణి

సీతానగరం: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఆయా గ్రామాల వలంటీర్లు వ్యయ ప్రయాసల కోర్చి పింఛన్లు బుధవారం పంపిణీ చేసారు. మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన చిల్లా సాయమ్మ అనారోగ్యానికి గురై విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు ఎం.రాణి విశాఖ వెళ్లి పింఛను పాయమ్మకు అందజేసారు. బళ్ళకృష్ణాపురం గ్రామానికి చెందిన పి.ఆచారి విజయనగరంలో శ్రీసత్యసాయి ఆస్పత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతున్నారు. అక్టోబరు 1న ప్రభుత్వం మంజూరు చేసిన పింఛను అందిపుచ్చుకునేందుకు రాలేక ఇబ్బందులు పడుతున్నానని తెలియజేయడంతో విజయనగరంలో చికిత్స పొందుతున్న ఆచారికి గ్రామ వలంటీరు నడిమింటి సునీత బుధవారం పింఛను అందజేసారు.

అనకాపల్లి వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాసుదేవరావు

పార్వతీపురం: వృద్ధాప్య పింఛన్‌ను అనకాపల్లి వెళ్లి వలంటీరు బుధవారం అందజేశాడు. మండలంలోని సంగంవలస సచివాలయ పరిధిలో అడ్డూరువలసకు చెందిన గుంటముక్కల పారమ్మకు అనకాపల్లి వెళ్లి గ్రామ వాలంటీర్ కర్రి వాసుదేవరావు పింఛన్‌ను అందజేశాడు. పారమ్మకు కొద్ది రోజుల నుండి తీవ్ర అనారోగ్యం కారణంగా అనకాపల్లిలో చికిత్స పొందుతూ కుమారుని ఇంట ఉంటుంది. ఈ మేరకు విషయం తెలుసుకున్న వలంటీరు పింఛన్ అందజేసేందుకు అనకాపల్లి వెళ్లి అందజేయంతో పారమ్మ హర్షం వ్యక్తం చేసింది.

డీఎస్పీ నాగేశ్వరరావుకు ఘన సన్మానం


డీఎస్పీ నాగేశ్వరరావును సత్కరిస్తున్న అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్


పార్వతీపురం టౌన్: మంగళగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీపై వెళ్తున్న రిజర్వ్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ బలివాడ నాగేశ్వరరావుకు బుధవారం ఘనంగా సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఒ.దిలీప్ కిరణ్, అధికారులు, సిబ్బంది దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ నిర్వహణ తదితర అంశాలలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అంతటా.. 'ఆరోగ్య సురక్ష'


పార్వతీపురం టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా తెచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అంతటా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని చోట్ల శిబిరాలు జరుగుతుండడంతో రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆస్పత్రులకు తిరిగే బాధ తప్పిందని సంబరపడుతున్నారు. ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్


సీతానగరం: రోగులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి


మక్కువ: శీబిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పౌష్టికాహారంతో ఆరోగ్యం


డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

సీతానగరం: మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నిడగల్లులో జరిగిన శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో ఏర్పడిన రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారం దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తహీనత నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి అరసాడ జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న పరస జగదీశ్వరరావును అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్.జనార్ధనరావు తెలిపారు. బుధవారం తనిఖీలు చేపట్టగా 25 మద్యం బాటిళ్లతో నిందితుడు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై ఆర్.రమేష్

తెర్లాం: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్సై ఆర్.రమేష్ సూచించారు. మండలంలోని నెమలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులై చదువులను నిర్లక్ష్యం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలని, బెట్టింగ్‌లు, కాలక్షేపం, గేమ్స్ ఆడేందుకు వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.